ఓం శ్రీసాయిరాం

# శ్రీకృష్ణచైతన్యుడు

*(ఇతడు బెంగాల్‌లో జన్మించిన భక్తులలో అగ్రగణ్యుడు. ఇతని పూర్వపు పేరు గౌరాంగుడు. కృష్ణ భక్తిలో తన్మయత్వమును అనుభవించుటచే ఇతనిని కృష్ణచైతన్యుడని పిలువజొచ్చిరి. కృష్ణభక్తి ప్రచారప్రధానుడు చైతన్యుడు. ఇతడు రాధావతారుడని కూడను కొన్ని నిదర్శనములు కలవు. రాధ కృష్ణుని చేరుటకెట్టి పరితాపముననుభవించెనో, చైతన్యుడు కూడను, మధురభక్తిని అనుభవింప మహాపరితాపమునొందెను. భగవద్గీతలో వర్ణింపబడిన భక్తి లక్షణములన్నియు ఇతనిలో మూర్తీభవించినవి. నిరంతరము కృష్ణభజన నృత్యములే ఇతనికి పవిత్ర సాధనలు. కృష్ణానందమే అతని ఆనందము. మహాశాంతచిత్తుడు ఈ చైతన్యుడు. తనను ద్వేషించు వారలను సహితము ప్రేమించు వాడు. ఇతరులకు కోపము తెప్పించుటకానీ, ఇతరులపై తాను కోపపడుటగానీ తానెరుగడు. తాను చేయు భజనలకు దుర్మార్గులెన్నియో అడ్డు కలిగించిననూ, అట్టి వారలను నిందించక, ఇది కృష్ణలీలలోని ఒక లీలయే యని భావించెడివాడు. ఒకనాడు ఇతను ఒక గ్రంథము వ్రాసి తన మిత్రునికి చూపగా, ఆ మిత్రుడు తాను వ్రాసిన గ్రంథముకంటె మిన్నగనున్నదని తలంచి, కొంత అసంతృప్తి పడుట చూచి, గమనించి, మిత్రుని కష్టపెట్టుట యిష్టము లేక తాను వ్రాసిన గ్రంథము చించి గంగలో పారవైచెను. భావములే భగవంతుని చేరుటకు తగిన ఉపాయములని నిరంతరం కృష్ణ ప్రేమోన్మత్తుడై చిత్తమున కృష్ణుని హత్తుకొని మత్తుడై మధురానందమును అనుభవించెడివాడు. తల్లి మనస్సు సంతృప్తి చేయనిది సాధన సిద్ధించదని గమనించి తల్లి అభీష్టము నెరవేర్చుటకు విష్ణుప్రియను పెండ్లి చేసుకొనెను. ఆమె చైతన్యుని వియోగముచే దుఃఖించి, దుఃఖించి కడకు మరణించెను. తదుపరి లక్ష్మిని పెండ్లాడెను. ఈరీతిగా తల్లి మనస్సును అనుసరించుటకూడను చైతన్యుని ఉత్తమ గుణములలో మరొకటి. ఒకపరి తానే కృష్ణుడు. కృష్ణుడే తానని ఏకత్వమును అనుభవించెడివాడు.)*

లోకులు తమను చూచి, 'సుఖంగా ఉన్నారు మీరు' అన్నప్పుడు సాధుసత్పురుషులకు విచారం కలుగుతుందట. లోకులు తమను నిందించి, తాళమృదంగాలు బద్దలుకొట్టే సంకీర్తనలతో సమయం వ్యర్థం చేస్తున్నావని తిట్టినప్పుడు చైతన్యునికి చాలా ఆనందం కలిగేది. ఈ లోకులు మూర్ఖులు. చెట్టు ఆకులకు నీరు పోస్తే వృక్షం పెరుగుతుందనుకుంటారు. ఆనందానికి మూలకారణమైన వేర్లకు నీరు పొయ్యాలి. అప్పుడు ఆనందము వృద్ధి పొందుతుంది. మీలోపల కృష్ణుడు ఆనందాలన్నింటికీ మూలం. ఆ కృష్ణుడు మీ హృదయాల్లో ఉన్నాడు. కృష్ణ నామ సంకీర్తనం చేసే భాగ్యం కలిగిందన్న సంతోషంతో, ఆనంద బాష్పాలతో ఆ వేరును తడపాలి. ఆ ప్రభువు మహిమ కీర్తించటమే మహాభాగ్యంగా భావించాలి.

ఒకప్పుడు చైతన్యుని తల్లి శచీదేవి ఇంటికి ఒక బ్రాహ్మణుడు వచ్చి, 'స్వయంపాకం చేసుకొంటాను, భగవంతుని నైవేద్యము నేను భుజించవలయును' అన్నాడు. వంటకు కావలసిన పదార్థములన్నియు యిచ్చిరి. అయితే, ఆయన వంట చేసి వివిధ పదార్థములను దేవికి ముందు నైవేద్యమని పెట్టితే, చిన్న పిల్లవాడైన చైతన్యుడు దానిని ముట్టి, అటు యిటు చల్లి పాడుచేయటము వల్ల, బ్రాహ్మణుడు తిరిగి తిరిగి వంట చేయవలసి వచ్చింది. ఎవరు ఎంత జాగ్రత్తగా పిల్లవానిని పట్టుకొనిననూ, ఆ సమయమునకు అందరి కన్నులను తప్పించుకొని, చైతన్యుడు నైవేద్యమును ముట్టి బ్రాహ్మణునికి బాధ కలిగించేవాడు. అతడు పడే కష్టములను చూచి సహించక, శచీదేవి చైతన్యుని లాగి కొట్టినది. అప్పుడు ఆ పిల్లవాడు, 'ఆయన తీసుకో అని పెడుతున్నాడు. మీరు

కూడదంటారు! ఆయనకూ నాకూ జరిగే ఈ విషయములో మీరెందుకు మధ్య తగాదాలు పెడుతున్నారు?' అని చెప్పగా, 'ఓ! ఈ బాలుడే సాక్షాత్ కృష్ణమూర్తి' అని బ్రాహ్మణుడు ఆనందాశ్రువులతో, చైతన్యునికే తాను చేసిన వంటకములను అర్పించి కృతార్థుడయ్యాడు.

శ్రీకృష్ణచైతన్యుని మొదటి పేరు గౌరాంగుడు. కృష్ణతృష్ణకు గౌరాంగుడు గొప్ప నిదర్శనం. ఆయన హృదయంలో మాలిన్యం లేదు. అతి నిర్మలమైన హృదయం. అందుకే గౌరాంగుడని పిలిచేవారు. కృష్ణనామము వినగానే తన చైతన్యమును మరచిపోయేవాడు. చుట్టూ వున్న ప్రపంచాన్ని మరచేవాడు. కాబట్టి కృష్ణచైతన్యుడనేవారు. గౌరాంగుడనగా తెల్లని వర్ణముగలవాడని అర్థము. అతడు కన్నులలో కృష్ణుని సుందర రూపమును, కర్ణాలలో కృష్ణుని దివ్యనామమును, హృదయములో కృష్ణప్రేమను నింపుకొని జీవించినవాడు. గౌరాంగుడు నవద్వీపంలో విద్యాభ్యాసం చేశాడు. ననద్వీపమనగా ఏదో ఒక పురము కాదని ఆనాడే తెలుసుకున్నాడు. నవద్వీపమనగా ఒక పురము కాదు. నవద్వారములు అనగా తొమ్మిది చిల్లులు గల దేహమని. శ్రీకృష్ణుని వేణువుకు కూడా తొమ్మిది రంధ్రములు. ఒకరోజు కృష్ణుని గౌరాంగుడు ఈవిధంగా ప్రార్థించాడు, 'కృష్ణా! నీ హస్తమునందున్న ఆ మురళి భాగ్యం యేమని చెప్పను! నిరంతరం నీ దివ్య హస్తములందుంటుంది. నీ ఉచ్ఛ్వాసనిశ్వాసములు దాని ద్వారానే సాగుతాయి. నీ పెదవులను స్పృశిస్తూ ఉంటుంది. నీవు దానిని ఉపయోగించని సమయంలో అది నీ బొడ్డు వద్ద విశ్రమిస్తుంది. ఆ మురళి ఏ సాధన చేసిందో చెప్పవా? నేను కూడా ఆ సాధన చేసి నీ సన్నిధికి చేరుకుంటాను' అన్నాడు.

ఒకనాటి రాత్రి కలలో కన్పించి శ్రీకృష్ణుడు తన చేతిలోని మురళి చూపిస్తూ, 'గౌరాంగా! ఇటు చూడు. ఈ మురళిలో యేముందో! దీని లోపల యేమీ లేదు. డొల్లగా ఉంది. అందుచేత నేను దాని ద్వారా మధురమైన గానము ఆలాపన చేస్తున్నాను. నీ దేహమునే మురళిగా భావించి దానిలోకి యెటువంచి విషయవాంఛలను చేర్చకు. కించిత్ విషయ వాసన ఉన్నా అందులో నా ఉచ్ఛ్వాసనిశ్వాసములు ప్రవేశించవు. ప్రవేశించినా శబ్దం సుస్వరంగా వుండదు' అని చెప్పాడు. ఆ మరునటి దినమునుండి స్వప్నంలో కృష్ణుడు చేసిన బోధను నిరంతరం మననం చేస్తూ, కృష్ణ నామంతోనే తన దేహమును పవిత్రంచేయాలని సంకల్పించుకున్నాడు. ఒక మృదంగము తెచ్చి మెడకు తగిలించుకున్నాడు. రెండు తాళాలు చేతబట్టాడు. శ్రీకృష్ణనామసంకీర్తనం భావరాగతాళములతో, తన్మయత్వంతో చేస్తూ నగర వీధులలో తిరుగుతూ ఉండేవాడు. జగత్తులో సాధారణంగా మంచి కార్యాలకు అడుగడుగునా యేవో అవాంతరాలు వస్తుంటాయి. అదేవిధంగా గౌరాంగునికి కొందరు దుండగులు అడ్డం తగిలి, ఒక రోజు అతని తాళాలను లాక్కున్నారు. గౌరాంగునికి కించిత్తైనా కోపం రాలేదు. 'కృష్ణా! నా తాళాలు నీకు శ్రవణానందము కలిగించ లేదా! అయితే వద్దులే' అనుకున్నాడు. తన భజనకు అడ్డు పడిన వారిని కోపగించ లేదు. మరునాడు కొందరు అతని మృదంగమును లాగుకొని బ్రద్దలు చేశారు. అప్పుడు, 'కృష్ణా! నా మృదంగ నాదంకూడా నీకు ఆనందము కలిగించలేదా! సరే!' అని చేతులతో చప్పట్లు కొట్టుకుంటూ భజన చేస్తూ వెళ్ళాడు. 'స్వామీ! పరులకు ఆనందమివ్వటమే నా ధ్యేయం' అని నిరంతరము భావిస్తూ, క్రమక్రమేణా తన హృదయమును కల్మష రహితం గావించి మురళి వలె రూపొందాడు. శ్రీకృష్ణ నామమే అతని ప్రాణం. కృష్ణా! అన్న శబ్దము వినగానే అతనికి చైతన్యము తప్పేది. అందుకనే అతనికి శ్రీకృష్ణచైతన్య అనే పేరు వచ్చింది.

కృష్ణచైతన్యుడు తాను నృత్యం చేస్తూ తన్మయత్వముతో ఉన్మత్తునివలె, తాను ఒకవిధమైన దైవత్వముయొక్క తాదాత్మ్య భావంలో లీనమైపోతున్నాడు. నవద్వీపపురంలో ప్రవేశించాడు. అక్కడ రాజులు, పెద్దవారందరు కృష్ణచైతన్యుడు చేస్తున్న భజన చూచి వారుకూడా తన్మయులైపోయేవారు. వారుకూడా ఈ భజనలో ప్రవేశించి వారి కిరీటాలు క్రింద పడిపోయేటట్లుగా ఎగురుతున్నారు. ఈ భజనలో ఒక దొంగరాముడు ప్రవేశించాడు. వాడు

జీవితమంతా దొంగతనము చేయటం, అబద్ధాలాడటం. వాడుకూడా వచ్చి అందులో పాల్గొన్నాడు. వాడు ఎందుకోసం చేరాడు? ఈ పెద్దరాజులంతా తన్మయత్వంతో మైమరచి ఎగురుతుంటే వారి జేబులలోంచి మెత్తగా కాజేయవచ్చని అనుకున్నాడు. కానీ, వాని అదృష్టము. వాడు తలచినది ఒకటి. అయితే ఆ జనంలో వచ్చి ఆడేటప్పటికి వాడు కూడను తన్మయుడైపోయాడు. వాని దేహమునే వాడు మరచిపోయాడు. సరే! అందరూ వెళ్ళేదాకా కాచుకొని ఉన్నాడు. ఈ చైతన్యుడు పదిమంది పిల్లలతో మాట్లాడుతున్న సమయంలో పరుగెత్తి వచ్చి పాదాలపై పడ్డాడు. 'స్వామీ! అందరికీ ఉపదేశమిస్తున్నారు. నాకుకూడా ఏదైనా నామం చెప్పండి' అని అడిగాడు. 'నీవెవరో, నీ చరిత్ర యేమిటో చెప్ప'మన్నాడు చైతన్యుడు. 'స్వామీ! నేను దొంగను. నేను దొంగతనము, అసత్యములతో జీవితము గడుపుచున్నాను. నా పేరు రాముడు. అందరూ నన్ను దొంగరాముడంటారు' అని ఉన్నదున్నట్లు చెప్పుకున్నాడు. 'నీకు ఉపదేశమిస్తాను. గురుదక్షిణ ఏమిస్తావు?' అని అడిగాడు చైతన్యుడు. 'స్వామీ! నేను ఏది దొంగతనము చేస్తానో దానిలో కొంత మీకిస్తాను' అన్నాడు. 'నాయనా! నాకది అక్కరలేదు. ఇకమీదట దొంగతనము చేయనని మాట యివ్వు. అదే గురుదక్షిణ' అన్నాడు. 'స్వామీ! ఏమైనా యిస్తానుగాని ఆ మాట యివ్వను' అన్నాడు. 'అయితే పోనీ, నేను నీకు ఉపదేశమిస్తాను. నీవు ఎక్కడ దొంగతనం చేయటానికి వెడతావో అక్కడ నేనిచ్చిన నామాన్ని 108 సార్లు జపించి తరువాత దొంగతనము చేయి' అన్నాడు. దగ్గరకు పిలిచాడు. సంభాషణం సంకట నాశనం. స్వామియొక్క సంభాషణతో వాని హృదయము చల్లబడింది. భయం కొంతవరకు తీరింది. వాని తల పట్టుకొని, చెవి దగ్గర నోరు పెట్టి 'ఓం నమోభగవతేవాసుదేవాయ' అని ఏకాదశాక్షరమంత్రం ఉపదేశించాడు. స్పర్శనం కర్మవిమోచనం. ఈ స్పర్శతో కర్మవిమోచనం అయిపోయింది. వెళ్లాడు వీడు. ఆ గ్రామములో ఉండే శ్రీమంతులు, గొప్పవారు భార్యాబిడ్డలతో చైతన్యుని దగ్గరకు వస్తున్నారు. ఈసమయం చక్కగా చూసుకున్నాడు. వారి ఖజానాకోసం వెళ్ళాడు. బీరువాలు తెరిచాడు. అన్నీ కనిపించాయి. కూర్చున్నాడు. ఓంనమోభగవతేవాసుదేవాయ 108 సార్లు జపించాలి. అప్పుడుగాని వాటిని ముట్టటానికి లేదు. ఈ 108 అయ్యేలోపల ఈ యజమాని, కుటుంబ సభ్యులంతా దర్శనం ముగించుకొని యింటికి వచ్చారు. శ్రీమంతుని భార్య నగలన్నీ తీసి పెడదామని గదిలోకి పోయింది. కనిపించాడు యితను జపం చేస్తూ. చూచింది యీామె. ఏ మహనీయుడో మా యింటిలో ప్రవేశించి నామం చేస్తున్నాడని భర్తను పిల్చుకొని వచ్చింది. ఆయనా చూచాడు. వీరు ఎవరో మహనీయులు. మా అదృష్టం యీనాటికి పండిందని అనేకవిధములుగా అతనిని గౌరవిస్తూ వచ్చారు. ఎందుకంటే గ్రామంలోకి చైతన్యుడు వచ్చాడు. ఆయన దర్శనం కోసం వచ్చారేమో! జపం చేసుకోటానికి మా యింటికి వచ్చారేమో! అని ఈవిధంగా ఉత్తమభావములంతా వారికి వచ్చాయి. జపం అయిపోయి కన్నులు తెరచి చూచేటప్పటికి అందరూ నమస్కారాలు చేస్తున్నారు. శ్రీమంతుడు నమస్కారం చేసి, 'మీరెవరండి? ఎక్కడనుండి వచ్చారు? తమరు మహానుభావులు. మా జన్మ ధన్యమైంది. మా యింట్లో మీరు భోజనము చేసి మమ్ములను ధన్యులను చేయాలి' అని ప్రార్థించాడు. అప్పుడు అతనిలో గొప్ప పరివర్తన వచ్చింది. 'అయ్యో! నేను దొంగతనం కోసం వచ్చి యీవిధముగా భగవన్నామస్మరణ వల్ల నాకే యింత గౌరవం యిస్తున్నారే, నిజంగా నేను ఒక ఋషిగా తయారైపోతే యింక ఎంత గౌరవాన్ని అందుకోవచ్చు. ఎంత ఉన్నత పదవిని పొందవచ్చు. ఛీ! ఈనాటినుండి నేను దొంగతనము చేయను' అని అనుకొని ఆ శ్రీమంతునికి నమస్కరించి యదార్థం చెప్పి, 'నన్ను వదలండి. నేను అడవికి వెళ్లి భగవచ్చింతనతో జన్మ సార్థకం గావించుకుంటాను'అని ప్రార్థించాడు. అప్పుడు వానిని పల్లకీలో ఉంచి ఉత్సవం చేయించి అడవిలో వదిలిపెట్టారు. అతడు దారిలో చైతన్యునికి నమస్కారం చేసుకొని, 'స్వామీ! నేను నిజమైన శిష్యునిగా అయ్యేటట్లు ఆశీర్వదించండి. ప్రపంచానికి సేవ చేయవచ్చు. అలాంటి ఉన్నత స్థాయికి పోయేటట్లుగా అనుగ్రహించండి. ఈనాటినుండి యిక దొంగతనం మానుతాను' అన్నాడు.

ఒకదినము చైతన్య మహాప్రభువు ఇంటి ముందు గడపకు అవతల ఒక వ్యక్తి మురికి శరీరముతో, చింపిరి గుడ్డలతో, జడలు కట్టిన శిరోజములతో కన్నులు మూసుకొని నిల్చుని ఉన్నాడు. అతనిని చూచి చైతన్య మహాప్రభువు బయటకు వచ్చి, 'నాయనా! నీవు ఎవరు? ఎందుకు ఇక్కడ నిల్చున్నావు? లోపలికి రావచ్చు కదా! రా!' అని ఆప్యాయంగా పిలిచాడు. మృదుమధురమైన అతని పిలుపుతో పులకరించి పోయినాడు ఆ వచ్చిన వ్యక్తి. అతడు కన్నులు తెరచి, 'స్వామీ! నేను మీ గృహములో అడుగు పెట్టుటకు అర్హత లేని జీవిని. నేను చండాలుడను, లోపలికి వచ్చి మీ గృహమును అపవిత్రము చేయలేను' అని సిగ్గుతో, భయముతో బదులు చెప్పాడు.

చైతన్యుడు అతని సమీపమునకు వెళ్ళి, 'నాయనా! నిన్ను నీవు కించపరచుకొనే మాటలు ఎందుకు పలుకుతావు? ఎవరు ఉత్తములు? ఎవరు నీచులు? ఈ ప్రపంచములో అందరూ అమృత పుత్రులే. ఒకే దివ్యచైతన్యము అందరిలోనూ ప్రకాశిస్తూ వుంటుంది. రా! లోపలికి రా!' అని ఆహ్వానించాడు చైతన్యుడు. ఆ వ్యక్తి సంకోచిస్తూ లోపలికి అడుగు పెట్టాడు. చైతన్యుడు, 'నాయనా! నీ రాకకు కారణం ఏమిటి? నీకు ఏమి కావాలి?' అని అడిగాడు. ఆ వ్యక్తి, 'స్వామీ! నేను నిరంతరం భగవన్నామ స్మరణచేస్తూ వుంటాను. కాని, నాకు ఎందుకో ఆ స్మరణ యాంత్రికముగా జరుగుతున్నదని అనిపిస్తున్నది. ఏదో చైతన్యరహిత స్థితిలో ఒడలు మరచి ఉచ్చరిస్తునట్లు వుంటుంది. మరి దీనికి కారణం నాలోపమా? నామము లోపమా? తెలియటం లేదు. మీరు మహాపురుషులు. మీ వద్ద ఉపదేశమును అందుకొని నామస్మరణ శక్తివంతముగ, దీప్తివంతముగా చేయవలెనని నా ఆకాంక్ష' అన్నాడు.

చైతన్యుడు, 'నాయనా! అన్ని నామములు శక్తివంతములే! దీప్తివంతములే! చైతన్యవంతములే! కాని, నీకు తృప్తినందించుటకు నీకు ఒక నామమును ఉపదేశం చేస్తాను. రా! లోపలికి వచ్చి కూర్చో' అన్నాడు. ఆ వ్యక్తి భయం భయంగా వణుకుతూ ఒక మూల ఒదిగి కూర్చున్నాడు. చైతన్యుడు, 'నాయనా! నీవు ఎందుకు అట్లు భయపడుతున్నావు? నిర్భయత్వం, స్వేచ్ఛ నీ జన్మహక్కు. అందరిలోనూ ప్రకాశిస్తున్న ఆ నిత్యసత్యమైన ఆత్మను గుర్తించి వర్తించు' అని పలికి అతనికి సమీపముగా కూర్చున్నాడు. ఆ వ్యక్తి, ' స్వామీ! అపచారము. మీరు నన్ను స్పృశించవద్దు. మీరు నన్ను స్పృశించిన సాంఘిక కట్టుబాటు ప్రకారము ఇద్దరము పాపముచేసిన వారమౌతాము. వర్ణాశ్రమ ధర్మమును ఉల్లంఘించినట్లు అవుతుంది. మిమ్ములను నేను నా గురువుగా భావిస్తున్నాను. నా గురువునకు ఎట్టి కష్టము కలిగించుటకు ఇష్టపడను. పూర్వజన్మ పాపఫలితముగా ఈ జన్మలో చండాలునిగా జన్మించాను. ఇప్పుడు మరింత పాపకార్యములు చేయలేను' అన్నాడు.

చైతన్య మహాప్రభువు, 'ఎంతటి మూర్ఖుడవు, ఎంత అజ్ఞానివి. నీవు అంటరానివాడివా? ఏ విధంగా? నీలో నాలో ప్రకాశించే దివ్యచైతన్యం ఒక్కటే. భగవంతుని విషయంలో జాతి, కుల భేదములు లేవు. సర్వము పంచభూతాత్మకము. పంచభూతములు భగవంతుని వలన ఆవిర్భవించినవే. గాలిది ఏ కులము? నీటిది ఏ కులము? భూమిది ఏ కులము? ఆకాశమునకు ఏది కులము? అగ్నిది ఏ కులము? అందరూ సమానముగా ఈ పంచభూతములను, ప్రకృతి సంపదలను అనుభవిస్తున్నారు. కాబట్టి, కుల, మత, వర్గ భేదభావము అర్థరహితము' అని అతనికి బోధచేసాడు.

కాని, ఆ వచ్చిన వ్యక్తి బాల్యమునుండి కులతత్త్వమును పాటించిన వాతావరణములో పెరిగినవాడు కావటంచేత, ఒక్కసారిగా భేదరాహిత్యం అలవడదు కదా! భయము, బిడియము మొదలగు ప్రవృత్తులు వదలవు. అది గమనించిన చైతన్యుడు, 'తప్పుచేయనివాడు, దురాచారములకు పాల్పడనివాడు భయపడటం ఎందుకు? అభయత్వము దైవీసంపద. నీవద్ద ధనము వుంటే దొంగలు వస్తారేమోనని భయం వుంటుంది. నీ వద్ద యేమీ లేనప్పుడు భయము ఎందుకు? నీకున్న చెడ్డగుణములను, దుష్టప్రవృత్తులను వదలివేయుము. అదే నిజమైన త్యాగము. త్యాగము వలన వైరాగ్యము, వైరాగ్యము వలన యోగము' అని బోధిస్తూ, అతనిని ఆలింగనం చేసుకున్నాడు. కాని, ఆ వ్యక్తి వణికిపోతూ వున్నాడు. భయం, ఆనందం అతనిలో కలుగుతున్నవి. 'స్వామీ! నా

పాపములు మిమ్మలను అంటకుండుగాక!' అని అన్నాడు అతను.

చైతన్యుడు అతని అమాయకత్వమునకు నవ్వుతూ, 'అమాయకుడా! ఇక్కడ నీవు, నేను ఒకటే. ఇదిగో నామమును ఉపదేశిస్తున్నాను' అని చెవిలో ఏదో నామమును పలికాడు. చైతన్యుడు పలికిన నామము ఆ వ్యక్తి హృదయాన్ని సూటిగా తాకింది. ఆ క్షణములోనే అతనిలో పరివర్తన కలిగింది. ఆనందంతో, 'స్వామీ! నావంటి భాగ్యశాలి ఎవరూ ఉండరు. నేను పతితుడను కాను. పావనుడను. నన్ను ఇంత కాలము అంటుకొని వున్న దేహభ్రాంతి ఈ క్షణమునుండి నన్ను వీడినది. 'నేను నేనే' అని తెలుసుకున్నాను. నేను అమృత పుత్రుడను' అని చైతన్యునితో పలికాడు.